క్లుప్తంగా

ఫెయిల్ అయిన విద్యార్థులకు సదావకాశం



పదవ తరగతిలో విద్యార్థినిని రీ అడ్మిషన్ చేయిస్తున్న సచివాలయ సిబ్బంది

ఆదోని సెంట్రల్: పదవ తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులను రీ అడ్మిషన్ చేయించుకుంటున్నామని పురపాలక పాఠశాల హెచ్ఎం మల్లికార్జున తెలిపారు. బుధవారం సచివాలయం సిబ్బంది, పురపాలక మేనేజర్ విజయ్ భాస్కరెడ్డి పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థిని ఫరీన్‌ను పాఠశాలలో చేర్చారు. వారు మాట్లాడుతూ గతంలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ఇలాంటి అవకాశం లేదన్నారు. ప్రతి విద్యార్థి చదువుకోవాలని ఎవరూ కూడా నష్టపోకూడదని ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందన్నారు. రీ అడ్మిషన్ చేసుకున్న విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో ఇప్పటి వరకు 10 మంది విద్యార్థులను చేర్చుకున్నట్లు చెప్పారు.

నివాళి

కోసిగి: మండలంలోని అగసనూరు గ్రామానికి చెందిన యం.కె. కర్రెప్ప (83) అనే వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి గ్రామానికి చేరుకుని ఆయన మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సర్పంచ్ వడ్డే ఉలిగయ్య, నాయకులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ నక్షత్ర పూజలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

ఆదోనిఅర్బన్ : పట్టణంలోని ఇందిరానగర్‌లో వెలిసిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ నక్షత్రం సందర్భంగా వేంకటేశ్వరస్వామి వారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామివారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, సుప్రభాతసేవ, విష్ణు సహస్రనామావళి, పారాయణం, కుంకుమార్చన, తులసీ అర్చన, పూల అలంకరణ, నైవేద్యం, మహామంగళ హారతి తదితర పూజలు చేపట్టారు. స్వామివారి జన్మ నక్షత్రం సందర్భంగా ప్రతి నెలా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వల్లూరులో కంటి వైద్య పరీక్షలు

కౌతాళం: మండలంలోని వల్లూరు గ్రామంలో బుధవారం ఉచిత కంటి వైద్య పరీక్షలు వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకుడు మరేగౌడ్ ఆధ్వర్యంలో కర్నూల్ అమీలియా ఆసుపత్రి వైద్యులు నిర్వహించారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో శిబిరం ఏర్పాటు చేసినట్లు చేశారు. 210 మంది కంటి పరీక్షలు చేయించుకోగా 32 మందికి ఆపరేషన్లు అవసరం కాగా వారిని కర్నూల్‌కు రెఫర్ చేసినట్లు తెలిపారు. 32మందికి ఎమ్మెల్యే సహకారంతో కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామని వైద్యుడు ఈరన్న తెలిపారు.

అధిక ఫీజులను నియంత్రించాలి

ఆదోని సెంట్రల్: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను నియంత్రించాలని రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్‌కుమార్, జిల్లా కార్యదర్శి బాలు కోరారు. బుధువారం ఎంఈఓ కార్యాలయం ఎదుట ఆర్‌పీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ విద్యార్థుల నుంచి వేలకు వేలు ఫీజులు వసులు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం మండిపడ్డారు. రామానాయుడు, అర్జున్, వీరేష్,రవి,శివ పాల్గొన్నారు.

గంగమ్మకు పూజలు



తుంగభద్ర దిగువ కాలువ జలాలకు పూజలు చేస్తున్న దృశ్యం

కౌతాళం: తుంగభద్ర దిగువ కాలువకు నీరు రావడంతో రాష్ట్ర పరిధి అయిన హానువాళు గ్రామం వద్ద బుధవారం సాయంత్రం ఎల్ఎల్‌సీ అధికారులు పూజలు నిర్వహించి గంగమ్మకు స్వాగతం పలికారు. ఈఈ శైలేశ్వర్‌రెడ్డి, ఏఈ రంగస్వామి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పీర్‌సాబ్, చంద్రశేఖర్ తుంగభద్ర జలాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈఈ మాట్లాడుతూ ఇప్పటికే డ్యాంలో 80టీఎంసీల వరకు నీరు నిల్వ ఉందని, ఖరీఫ్ సాగు కోసం కాలువకు నీరు విడుదల చేశారని చెప్పారు. డ్యాంకు ఇన్‌ఫ్లో ఇలాగే కొనసాగితే మరో వారం రోజుల్లో పూర్తి స్థాయిలో నిండిపోతుందన్నారు.

సర్వే వేగవంతం చేయండి

ఆలూరు రూరల్: అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో చేపట్టిన ఓటరు సవరణ వేగవంతం చేయాలని ఆలూరు అసిస్టెంట్ ఎన్నికల అధికారి రామాంజనేయులు ఆదేశించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. బీఎల్‌ఓలు వారి పరిధిలో నిర్వహించే ఓటరు సర్వేను సూపర్‌వైజర్లు పర్యవేక్షించాలన్నారు. సాంకేతిక సమస్యలను తమకు తెలియజేయాలన్నారు.

మెట్ట భూములకు జీవం

- రూ.18.52 కోట్లతో ఐరన్‌గల్ ఎత్తిపోతల పనులు
- ఆయకట్టుగా మారనున్న 1,515 ఎకరాల మెట్ట భూములు
- పైపులైన్, పంపుహౌస్ పనులు 70 శాతం పూర్తి
- వేగంగా సాగుతున్న నిర్మాణ పనులు



జోరుగా సాగుతున్న ఐరన్‌గల్ ఎత్తిపోతల పథకం పైపులైన్ పనులు

మంత్రాలయం : మెట్ట భూములు జీవం పోసుకోనున్నాయి. ఎత్తిపోతల సాగునీటితో సస్యశ్యామలం కానున్నాయి. జల కళతో మాగాణిగా మారనున్నాయి. కరువు నేలగా పేరుగాంచిన కోసిగి మండలంలోని ఐరన్‌గల్ పొలాలకు జల గలగలలు దరి చేరనున్నాయి. రైతన్నల ఏళ్ల నాటి కళ సాకారం కానుంది. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కృషితో నియోజకవర్గంలో నూతనంగా 5 ఎత్తిపోతల పథకాలు నిర్మాణం చేపట్టారు. అందులో భాగంగా ఐరన్‌గల్ ఎత్తిపోతల పథకం పనులు శరవేగంగాసాగుతున్నాయి. రూ.18.52 కోట్లతో ఐరన్‌గల్ పథకానికి శ్రీకారం చుట్టారు. నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని వడివడిగా పనులు కానిస్తున్నారు. ఇప్పటికే 70 శాతం పనులు పూర్తి కావొచ్చాయి. తుంగభద్ర నదీ జలాలను తరలించి మెట్ట భూములకు సాగు నీరు అందించనున్నారు. తుంగభద్ర నది ఒడ్డున పథకం పంపుహౌస్ పనులు చేపట్టారు. 7.5 కి.మీ. మేర పైపులైన్ వేస్తున్నారు. 5 ఎత్తిపోతల పథకాలను నవంబర్ నాటికి పూర్తి చేయాలని నిర్ణయించారు. నిర్ణీత కాలానికి పనులు పూర్తి చేసి పంట పొలాలకు సాగు నీరు అందించేందుకు కృషి చేస్తున్నారు.

1,515 ఎకరాలకు సాగునీరు..

ఐరన్‌గల్ గ్రామ పరిధిలో ఎక్కువగా వర్షధారం కింద పంటలు సాగవుతాయి. పథకం ద్వారా 1,515 ఎకరాల సాగు భూమి ఆయకట్టుగా మారనుంది. ఏడాదిలో రెండుకార్ల పంటలు పండించేందుకు అవకాశం ఏర్పడనుంది. తమ ఊరికి సాగు నీరు వస్తుడడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిశ్చితంగా పంటలు పండించుకోవచ్చని సంబరపడుతున్నారు. ప్రభుత్వం సాహకారం ఏనాటికీ మర్చిపోమంటున్నారు.



కొనసాగుతున్న పంపుహౌస్ పనులు

నవంబర్ నాటికి పూర్తి



ఎంతో ప్రతిష్టాత్మకంగా నియోజకవర్గంలో 5 ఎత్తిపోతల పథకాలు నిర్మించేందుకు శ్రీకారం చుట్టాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో రైతుల ఇబ్బందులు తీర్చేందుకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నాం. నియోజకవర్గంలో మెట్ట భూములను ఆయకట్టుగా మార్చేందుకు ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నాం. నవంబర్ నాటికి పథకాల నిర్మాణాలు పూర్తి చేయాలని సంకల్పించాం. రైతుల కష్టాలు తీర్చేందుకు కట్టుబడి శ్రమిస్తున్నాం. సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం. – వై.బాలనాగిరెడ్డి, ఎమ్మెల్యే

వలసలు తగ్గుతాయి



వానాకాలం ముగియగానే ఇక్కడి రైతులు వలస వెళ్తారు. పొలాలన్నీ వర్షధారం కావడంతో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుత ప్రభుత్వం తమ గ్రామానికి ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేస్తుంది. దీంతో మా గ్రామంలో రైతులు వలస వెళ్లే పద్ధతి త్వరలో కనుమరుగు కానుంది. రైతులతో పాటు రైతు కూలీలకు కూడా ఇక్కడే పనులు పుష్కలంగా దొరకనున్నాయి. – నాగరాజు, ఐరన్‌గల్

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



మా ఊరికి ఎత్తిపోతల పథకం మంజూరు చేసిన ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. రైతుల కష్టాలను గుర్తించి పథకం ఏర్పాటు చేయడంతో మా గ్రామ రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పథకం పరిధిలో నాకున్న 2 ఎకరాలకు సాగునీరు అందనుంది. మెట్ట రైతుల కన్నీళ్లు తుడిచేందుకు ముందుకు రావడం హర్షనీయం. – సోమప్ప, ఐరన్‌గల్

6 ఎకరాలు ఆయకట్టుగా మారనుంది



మా పంట పొలాలను ఆనుకుని పథకం ఏర్పాటు కానుంది. నాకున్న 6 ఎకరాల మెట్ట భూమి ఆయకట్టుగా మారనుంది. గతంలో కేవలం పత్తి, కొర్ర, సజ్జ పంటలు పండించుకునే వాళ్లం. సాగునీరు వస్తే వరి, మిరప, ఉల్లి, తదితర వాణిజ్య, లాభదాయక పంటలు సాగు చేసుకునే అవకాశం లభిస్తుంది. పథకం రావడం సంతోషంగా ఉంది. – భీమసేన, ఐరన్‌గల్

నేడు అష్టోత్తర పారాయణం

మంత్రాలయం : రాఘవేంద్రస్వామి మఠంలో అధిక శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని గురువారం సామూహిక అష్టోత్తర పారాయణం నిర్వహించనున్నారని ఆలయ ఏఏవో మాధవశెట్టి, మేనేజర్ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు ఆశీస్సులతో ఉదయం నుంచే పూజోత్సవాలు మొదలవుతాయి. కార్యక్రమం సందర్భంగా రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి విశేష పంచామృతాభిషేకం, విశిష్ట పూజలు చేపడతారు. సామూహిక అష్టోత్తర పారాయణంలో పాల్గొనే భక్తులకు ఉచిత వసతి సైతం ఏర్పాటు చేశారు.

రేపు శ్రీరామ కోటి పారాయణం..

మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో తమిళనాడుకు చెందిన ఆధ్యాత్మిక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక శ్రీరామ కోటి పారాయణం నిర్వహించనున్నారు. పీఠాధిపతి సుబుదేంద్రతీర్థు లు సమక్షంలో వేలాది మందితో నిర్వహించనున్న కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

నిర్మాణాలు పూర్తి చేయాలి

పెద్దకడబూరు : నాడు – నేడు కింద చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దారు వీరేంద్రగౌడ్, ఎంఈఓ రామమూర్తి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ. 62.5లక్షలతో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల నిర్మాణాలను పంచాయతీరాజ్ ఏఈ మల్లయ్యతో కలసి బుధవారం పరిశీలించారు. హెచ్ఎం రాజేశ్వరి, ఆర్ఐ మహేష్ ఉన్నారు.

తల్లీబిడ్డ సంరక్షణే ప్రభుత్వ లక్ష్యం



గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిటౌన్: తల్లీ, బిడ్డల సంరక్షణే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. తల్లి ఆరోగ్యంగా ఉంటేనే బిడ్డ క్షేమంగానూ, ఆరోగ్యంగా జన్మిస్తారని తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం 35వ వార్డు అమరావతినగర్‌లోని అర్బన్‌హెల్త్ సెంటర్‌లో గర్భిణిలు, బాలింతలకు పోషకాహార పంపిణీ, గర్భిణులకు సీమంతం, పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాన్ని ఇన్‌చార్జ్ సీడీపీఓలు రాగిణి, వసంత, సూపర్‌వైజర్ గ్రేడ్-1 సావిత్రి, స్వయంప్రభ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఐదుగురు గర్భిణులు, ఇద్దరు పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చేపట్టారు. ఈ సందర్భంగా పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. 2451 మంది బాలింతలు, 2857 మంది గర్భిణులకు ప్రతినెలా ఇంటి వద్దకే వచ్చి పది రకాల పోషకాహార కిట్లను అంగన్‌వాడీ సిబ్బంది అందజేస్తారని చెప్పారు. 3 కేజీల బియ్యం, కిలో కంది పప్పు, అర లీటర్ వంట నూనె, 25 కోడిగుడ్లు, 5 లీటర్ల పాలు, చిక్కీలను అందిస్తారని వివరించారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు దేవా, వార్డు ఇన్‌చార్జ్ ఎర్రిస్వామి పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



అమరావతినగర్‌లో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి



సంతపేటలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మనోజ్‌కుమార్‌రెడ్డి

ఆదోనిటౌన్ : పేదల అభ్యున్నతే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఆయన తనయుడు మనోజ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. పథకాల అమలు, పాలన తీరు, ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు సీఎం జగనన్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రూపొందించారని చెప్పారు. బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అమరావతినగర్‌లో ఎమ్మెల్యే రాత్రి 8 గంటల వరకు పర్యటించగా, 28 వార్డు సంతపేట, వీరశైవ కళ్యాణమండపం, పేట వీరభద్రస్వామి ఏరియా తదితర కాలనీల్లో యువనేత మనోజ్‌కుమార్‌రెడ్డి ఇంటింటికీ తిరిగి పథకాలు, లబ్ధి, సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ పథకాలకు అర్హులైన వారిని గుర్తించాలని కమిషనర్ రఘునాథ్ రెడ్డి, వలంటీర్లకు సూచించారు. అమరావతినగర్‌లో షాషాబీకి వితంతు పింఛన్, గౌసియాబీకి అమ్మ ఒడి పథకం మంజూరు కాలేదని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే వెల్ఫేర్ సెక్రటరీ, అడ్మిన్, ఎడ్యుకేషన్ సెక్రటరీలను విచారించారు. సర్టిఫికెట్లు, డెత్ సర్టిఫికెట్లు లేవంటూ సాకులు చెప్పడం కాదని మండిపడ్డారు. అలాగే..28 వార్డు సంతపేట, వీరశైవ కళ్యాణమండపం, పేట వీరభద్రస్వామి ఏరియా తదితర కాలనీల్లో యువనేత మనోజ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత పర్యటించారు. గడపగడపకు తిరుగుతూ సమస్యల పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన డైరెక్టర్ పోలకల్ రేణుక, నాయకులు దేవా, ఎర్రిస్వామి, రవి, వైస్ చైర్మన్ తిమ్మప్ప, కౌన్సిలర్ సురేష్, నాయకులు తాయన్న, శ్రీనివాసులు, లక్ష్మినారాయణ, మురళీరెడ్డి, ఫాతిమా, శ్రీలక్ష్మి, జిలేకాబీ, గౌసియా, చంద్రకాంత్ రెడ్డి, సన్ని, శ్రీనివాసరెడ్డి, సింహం నాగేంద్ర, లింగాయతీ కార్పొరేషన్ డైరెక్టర్ మంజుల, మల్లి, నీలకంఠ, కౌన్సిలర్లు బాలాజీయాదవ్, రామలింగేశ్వరయాదవ్, గౌస్, నరసింహులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత

ఆదోనిరూరల్ : ప్రభుత్వం అందజేసే పౌష్టికాహార కిట్లను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి తెలిపారు. బుధవారం మండలంలోని మదిరె గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో 16 మంది గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఆమె మాట్లాడుతూ 3 కేజీల బియ్యం, కిలో కంది పప్పు, అర లీటర్ వంటనూనె, 25 కోడిగుడ్లు, 5 లీటర్ల పాలు, చిక్కీలను ప్రతి నెలా అందిస్తారన్నారు.

కోసిగి: మండలంలోని వందగల్లు గ్రామంలో ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు అందించిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు సద్వినియోగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యం పొందాలని సర్పంచ్ కొరవంజమ్మ సూచించారు. బుధవారం గ్రామ అంగన్‌వాడీ కేంద్రం వద్ద కిట్లు అందజేశారు.

పెద్దకడబూరు : వైఎస్సార్ సంపూర్ణ పోషణ బాలింతలు, గర్భిణులకు వరంలాంటిదని ఎంపీపీ శ్రీవిద్య, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బాలింతలు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లును పంపిణీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు యూనిఫాం అందజేశారు. సర్పంచ్ రామాంజనేయులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు విజయకుమారి, వీరగోవిందమ్మ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లును పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీవిద్య

కౌతాళం: సంపూర్ణ పోషణతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎంపీపీ అమరేష్ అన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాలింతలు, గర్భిణులకు పౌష్టిక ఆహార కిట్లను అందజేశారు. కార్యక్రమంలో కన్వీనర్ ప్రహ్లాదాచారి, సుబ్బారాజు, రాఘవేంద్రరెడ్డి, సర్పంచ్ పాల్‌దినకర్, ఉప సర్పంచ్ తిక్కయ్య, నదిచాగి రామన్నగౌడు, మాజీ ఎంపీటీసీ చౌదరిబసవ, తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ సుబ్బారాజు పాల్గొన్నారు. నదిచాగి గ్రామంలో ఎంపీటీసీ లింగన్న ఆధ్వర్యంలో, కుంబళనూరు క్యాంపు–1లో ఇన్‌చార్జి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు.



పౌష్టికాహార కిట్లను అందజేస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్, సిబ్బంది

తెగుళ్లు నివారిస్తేనే అధిక దిగుబడులు

ఆలూరు: ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పత్తి, మిరప పైర్లకు సోకిన పురుగులు, తెగుళ్లను నివారించుకుని మంచి దిగుబడులు సాధించాలని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ సుజాతమ్మ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఏడీఏ సునీత ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు, ఆర్బీకేలలో పనిచేస్తున్న ఎంపీఈఓలు, వీఏఏలు, వీహెచ్ఓలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాట్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ సుజాతమ్మ మాట్లాడుతూ.. భూసార పరీక్షల ఫలితాలు, నేల స్వభావాన్ని ఎరువులు వాడాలన్నారు. శశిధర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకటేష్‌గౌడు, ఆనంద్ ఉన్నారు.

క్రైం కార్నర్

కుక్కల దాడిలో గొర్రెలు, మేకలకు గాయాలు



గాయపడిన గొర్రె, మేక పిల్లలు

ఆదోని రూరల్ : మండలంలోని పాండవగల్లు గ్రామంలో బుధవారం కుక్కల దాడిలో ఎనిమిది గొర్రె పిల్లలు, ఏడు మేక పిల్లలు తీవ్రంగా గాయపడ్డాయి. బాధితుడు చింతకుంట నరసయ్య తెలిపిన వివరాల మేరకు..గొర్రెలు, మేకలను మేపడానికి అడవులకు తీసుకెళ్లగా, వాటికి సంబంధించిన పిల్లలను కంచె వేసిన ప్రదేశంలో ఉంచి వెళ్లగా రెండు కుక్కలు ప్రవేశించి దాడి చేసి గాయపరిచాయన్నారు. దీంతో 15 గొర్రె, మేక పిల్లలు తీవ్రంగా గాయపడ్డాయని కన్నీటి పర్యంతమయ్యారు.

పాముకాటుతో యువతికి అస్వస్థత

ఆదోనిఅర్బన్ : ఆస్పరి గ్రామానికి చెందిన బాలుసాబ్ కుమార్తె జీనత్ అనే యువతిని బుధవారం పాము కాటు వేయడంతో అస్వస్థతకు గురైంది. వెంటనే బంధువులు ఆదోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఉదయం పొలానికి వెళ్లిన సమయంలో అక్కడ పాము కాటు వేసిందని, ఆసుపత్రిలో యువతి కోలుకుంటుందని చెప్పారు.

ఎస్‌బీఐలో షార్ట్‌సర్క్యూట్

మంత్రాలయం : స్థానిక స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్యాంకులో బుధవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ చోటు చేసుకుంది. మధ్యాహ్నం అనుకోకుండా బ్యాంకు బండింగ్ మిషన్ షార్ట్‌సర్క్యూట్‌తో పేలింది. దీంతో బ్యాంకు అధికారులు అప్రమత్తమై విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఆ సమయంలో ఎలాంటి నోట్లు మిషన్‌తో ఉంచకపోవడంతో ఎలాంటి నష్టం వాటిల్లలేదని వారు తెలిపారు.

మాతా శిశు ఆరోగ్యానికి ప్రాధాన్యత



పౌష్టికాహార కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాతా శిశు ఆరోగ్యానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని రాంపురం సచివాలయంలో బాలింతలు, గర్భిణులకు వైఎస్సార్ కిట్లు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజ స్థాపనకు జగనన్న కట్టుబడి పనిచేస్తున్నారని తెలిపారు. బాలింతలు, గర్భిణుల కోరిక మేరకు నెలానెలా పౌష్టికాహార కిట్లను ఇళ్లకే ఇస్తారని వెల్లడించారు. ప్రతి బాలింత, గర్భిణికి 3 కేజీ బియ్యం, కేజీ కంది పప్పు, రెండు కేజీల రాగిపిండి, కేజీ అటుకులు, 250 గ్రాముల కర్జూరం, ప్యాకెట్ చిక్కీలు, 450 గ్రాముల నూనె పంపిణీ చేస్తారని వివరించారు.

అంగన్‌వాడీ సిబ్బందికి దుస్తులు పంపిణీ..

రాంపురం గ్రామ సచివాలయంలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చీరలు పంపిణీ చేశారు. మంత్రాలయం సెక్టార్ పరిధిలో 251 మందికి రెండు చీరలు చొప్పున మంజూరయ్యాయి. బుధవారం 53 మందికి చీరలు అందజేశారు. సీడీపీఓ నాగమణి, సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి బాయి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి ఐక్యంగా పోరాడుదాం

ఆదోనిరూరల్ : జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ఐక్యంగా పోరాడుదామని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు, కర్నూలు మాజీ ఎమ్మెల్యే గఫూర్, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో జిల్లా సమగ్రాభివృద్ధి, సాగు, తాగుటి సమస్యలపై సమావేశమయ్యారు. సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. ఆదోనిలో మూతబడిన ఫ్యాక్టరీలను పునఃరుద్ధరించి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఈనెల 2 నుంచి 7వ తేదీ వరకు ఆదోని నుంచి కర్నూలు వరకు సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టి కలెక్టరేట్‌ను ముట్టడిస్తున్నామని అన్ని పార్టీలు సహకరించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ దేవిశెట్టి ప్రకాష్, ఆర్‌సీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి, అట్ల సంఘం నాయకులు ఆదినారాయణ, సీపీఎం రాష్ట్ర నాయకులు ప్రభాకర్ రెడ్డి, సీపీఐ నాయకులు అజయ్‌బాబు, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.



అభివాదం తెలుపుతున్న నాయకులు

నిర్మాణాల్లో అలసత్వం వహిస్తే చర్యలు

ఆదోని రూరల్ : హౌసింగ్ నిర్మాణాలను వేగవంతం చేయాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హౌసింగ్ పీడీ వెకంటనారాయణ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పీడీ వెంకటనారాయణ, ఆదోని నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్, పంచాయతీ రాజ్ ఎస్ఈ సుబ్రహ్మణ్యం హాజరై మాట్లాడారు. ప్రభుత్వం లబ్ధిదారులకు స్టీల్, సిమెంట్, ఇసుక ఇస్తున్నప్పటికీ నిర్మాణాలు ఎందుకు ఆలస్యమవుతున్నాయని, ఇందులో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఎంపీడీఓ గీతావాణి, ఎంఈఓ శ్రీనివాసులు, పీఆర్ ఏఈ మాలిక్‌బాషా, హౌసింగ్ డీఈ రవికుమార్, హౌసింగ్ ఏఈలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ వెంకటనారాయణ

నారాయణ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

ఆదోనిరూరల్ : పట్టణంలోనున్న నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్ఓ జిల్లా కార్యదర్శి తిరుమలేష్, ఆదోని డివిజన్ ప్రెసిడెంట్ ఖాదర్, అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం విద్యాసంస్థల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారాయణ విద్యాసంస్థలు ఒకవైపు ఇలా ప్రభుత్వ విద్యను ధ్వంసం చేస్తూ మార్కులు, ర్యాంకుల కోసం విద్యార్థులతో చదువులను బట్టీ కొట్టిస్తుందని మండిపడ్డారు. విద్యార్థులు ఒత్తిడి తట్టుకోలేక మానసికంగా తీవ్ర ఆవేదనకు గురవుతున్నారన్నారు. ప్రవీణ్, నవీన్, ప్రకాష్, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి

ఆదోనిరూరల్ : విద్యార్థులు చదువులో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని వక్తలు పేర్కొన్నారు. బుధవారం ఆదోని–ఆలూరు రహదారిలోని భీమా ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాయన్ క్లబ్ కార్యక్రమాన్ని విశ్వనారాయణ జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నాగజ్యోతి, నేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఫణిశేఖర్, మున్సిపల్ హైస్కూల్ టీచర్ నాగరాజు హాజరై ప్రారంభించారు. సెక్రటరీ విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సురేంద్రబాబు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్త తీసుకోవాలి

ఆదోని అర్బన్ : ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు కృష్ణమూర్తి, గోపీనాథ్, ఉషారావు సూచించారు. బుధవారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కిడ్డీస్ రూట్స్ గ్లోబల్ స్కూల్‌లో ఆరోగ్యం పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు.